# పల్లె కన్నీరు పెడుతోంది

- పైసా లేని పంచాయతీలు
- నిధుల కోసం ఎదురుచూపులు
- గ్రామాల్లో పాలనకు తిప్పలు
- అప్పుల పాలవుతున్న పంచాయతీ సెక్రటరీలు




**వరంగల్ వాయిస్, దామెర :** పల్లెలు పరిపుష్టమైతేనే దేశం ప్రగతి పథంలో పయనిస్తుంది. కాని ఆ పల్లెలు పాలకుల నిర్లక్ష్యానికి సాక్షిభూతంగా నిలుస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక నీరసించిపోతున్నాయి. నెలల తరబడి గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. చివరకు విద్యుత్ బిల్లులు, నీటి ట్యాంకుల నిర్వహణకుసైతం నిధులు లేకపోవడంతో ప్రత్యేక అధికారులు గ్రమాల్లోకి వెళ్లేందుకు ముఖం చాటేస్తున్నారు. నిధుల కొరత కారణంగా గ్రామాల్లో సమస్యలు కుప్పలు తె ప్పలుగా పేరుకుపోతున్నాయి.

### ఏడాదిగా ఇంచార్జులే..

సర్పంచుల పదవీకాలం ముగిసి ఏడాది దాటినా గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామపంచాయతీలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. సరిగ్గా గత ఫిబ్రవరి 2వ తేదీన సర్పంచుల కాలం ముగిసింది. అప్పటినుంచే కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం గ్రామపంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. అయితే సర్పంచులు లేకపోవడంతో గ్రామ కార్యదర్శులు పాలన సాగించేందుకు అరిగోస పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనులకు గ్రామపంచాయతీ కార్యదర్శి అదనపు భారాన్ని ఎదుర్కోవాల్సి వస్తోంది. ట్రెజరీలో ఉన్న చెక్కులను రిలీజ్ చేయడంతోపాటు గ్రామ పంచాయతీలకు నిధులు ఇస్తేనే పూర్వవైభవం వస్తుందని కొందరు సెక్రటరీలు అభిప్రాయపడుతున్నారు.



### చేతులెత్తేసిన కార్యదర్శులు..

ఇంతకాలం చిన్న చిన్న ఖర్చులు జేబుల్లో నుంచి వెచ్చించిన పంచాయతీ కార్యదర్శులు.. ఇక తమ వల్ల కాదంటూ చేతులెత్తేశారు. ఫలితంగా గ్రామాల్లో వీధి దీపాలు వెలుగకపోయినా, బోరు పని చేయకపోయినా, ట్రాక్టర్లలో డీజిల్ లేకపోయినా వాటి ఫలితం ప్రజలు అనుభవించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇంతకాలం కార్యదర్శులు సొంతంగా వెచ్చించిన నిధులు తిరిగి రాక పోగా, నగదు చెల్లించకుండా సామగ్రిని ఇచ్చేందుకు షాపుల నిర్వాహకులు నిరాకరిస్తుండడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయే పరిస్థితులు నెలకొన్నాయి.



### నిధులు మంజూరు చేయాలి :

**– ఇంజపెల్లి నరేష్, జిల్లా కార్యదర్శి, పంచాయతీ కార్యదర్శుల ఫోరం**

రాష్ట్ర సర్కారు చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. సదరు కార్యక్రమాలు ఏ శాఖకు సంబంధించినవి అయినప్పటికీ సెక్రటరీలు వాటిని భుజాన వేసుకొని పనులు ముగిస్తున్నారు. కనీసం సెలవులు కూడా తీసుకోకుండా వర్క్ చేస్తున్నారు. ఏడాదికాలంగా గ్రామపంచాయతీ నిర్వహణకు పలువురు కార్యదర్శులు అప్పులు తెచ్చి స్థానిక అవసరాలను చక్కదిద్దారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయడంతోపాటు పెండింగ్ బిల్లులు చెల్లించి అదనపు భారం నుంచి మాకు విముక్తి కల్పించాలని నరేష్ కోరారు.




# సర్కిల్ కార్యాలయాల్లో.. ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్

- కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో పురోగతి అవసరమని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. క్షేత్ర స్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతిపై బుధవారం ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు కాశీబుగ్గ, ఖాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని సీపీని ఆదేశించారు. వార్డు ఆఫీసర్ లు ప్రతి రోజు 50 దరఖాస్తులను పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని, ఎల్ఆర్ఎస్ పై అవగాహన కోసం సర్వేయర్ ల సేవలు వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీలు రజిత, నస్రీన్, ఖలీల్, శ్రీనివాస్ రెడ్డి, యేర్షద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాల కూల్చివేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా హంటర్ రోడ్డు సర్వేనెంబర్ 125/సి లోని 2,000 గజాల భూమిలో ఉన్న అక్రమ నిర్మాణాలను బుధవారం గ్రేటర్ వరంగల్ అధికారులు కూల్చివేశారు. హంటర్ రోడ్ లోని తమ తాత, ముత్తాతల నుంచి సంక్రమించిన స్థలంలో నంబూరి చారుమతి పేరిట నిర్మించిన అక్రమ నిర్మాణాలు తొలగించాలంటూ మంద యాకూబ్ 17 నవంబర్ 2022లో బల్దియా అధికారులను ఆశ్రయించారు. రెండు సంవత్సరాలుగా వరంగల్ మహా నగర పాలక సంస్థ కార్యాలయం చుట్టూ తిరుగుతూ న్యాయం చేయాలని అభ్యర్థించారు. తాను 2022 లో ఇచ్చిన కంప్లైంట్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ 5 ఫిబ్రవరి 2025న మరోసారి బల్దియా కమిషనర్ కు మంద యాకూబ్ విజ్ఞప్తి చేశారు. ఇతని ఫిర్యాదు మేరకు విచారణ చేసిన ఉన్నతాధికారులు నంబూరి చారుమతి నిర్మించినవి అక్రమ నిర్మాణాలే అని తేల్చి వాటిని కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి 25 లోపు నిర్మాణాలను నేలమట్టం చేయాలని బల్దియాను ఆదేశించగా ఉత్తర్వులను రద్దు చేయాలని నంబూరి చారుమతి హైకోర్టును ఆశ్రయించారు. అయినా ఆమెకు ఊరట దక్కలేదు. దీంతో గ్రేటర్ సిబ్బంది కట్టడాలను కూల్చివేశారు.



# ఇంటర్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన సీపీ

**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సందర్శించారు. పరీక్షా కేంద్రాల్లో చేపట్టిన బందోబస్తుతో పాటు పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు తీసుకున్న చర్యలపై ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ కమిషనర్ స్థానిక ఇన్ స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు.

# అన్నదాతలకు టోకరా

**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్నదాతలను మోసం చేస్తూ పెద్ద మొత్తంలో నకిలీ పురుగు మందులను విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను టాస్క్ ఫోర్స్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేశారు. వీరి నుంచి సుమారు రూ.34 లక్షల విలువ కలిగిన వివిధ ప్రముఖ కంపెనీల పేర్లతో ఉన్న నకిలీ పురుగు మందులతో పాటు, రెండు కార్లు, ఐదు సెల్ ఫోన్లు, నకిలీ పురుగు మందు లేబుల్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ వివరాలను వెల్లడిస్తూ రెండు రోజుల క్రితం టాస్క్ ఫోర్స్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా వరంగల్ గోపాలస్వామి గుడి ప్రాంతంలో వాహన తనీఖీలు నిర్వహించారు. ఇదే సమయంలో అనుమానాస్పదంగా ఉన్న ఒక కారును తనిఖీ చేయగా అందులో నఖిలీ పురుగు మందల



డబ్బాలను గుర్తించి నిందితుల్లో ఒకడైన కర్ణాటక రాష్ట్రం చెందిన కాట్రగౌడ భాస్కర్ రెడ్డి అదుపులోకి తీసుకొని విచారించారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా హైదరాబాద్ లోని చర్లపల్లి ప్రాంతంలో నిందితుల గోడౌన్ పై దాడి చేసి హైదరాబాద్ కు చెందిన పిల్ల నాగవెంకట రంగారావు, ముద్దంగుల ఆదిత్య, పిట్ల నవీన్, మిర్యాలగూడ ఇందిరమ్మ కాలనీకి చెందిన దూదిమెట్ల శ్రీధర్ ను అదుపులోకి తీసుకున్నారు. వీరితోపాటు బెయర్, టాటా, కోర్టెవాతో పాటు మరో నాలుగు బ్రాండెడ్ కంపెనీల పేర్లతో తయారు చేసిన నకిలీ పురుగు మందులు, గడ్డి మందులే. లేబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా రైతుల డిమాండ్ మేరకు వివిధ కంపెనీల పేర్లతో నకిలీ పురుగు మందులు, గడ్డి మందులను తయారీ చేసి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నట్లు సీపీ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, టాస్క్ ఫోర్స్, వరంగల్ ఏసీపీలు మధుసూధన్, నందిరాంనాయక్, టాస్క్ ఫోర్స్ మట్టెవాడ ఇన్ స్పెక్టర్లు రాజు, గోపి, ఎస్సైలు భానుప్రకాశ్, లచ్చయ్య, సాంబయ్య, ఏఏఓ సల్మాన్ పాషా, కానిస్టేబుళ్ళు సురేష్, సాంబరాజు, సురేందర్, రమేష్ లను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అభినందించారు.